ప్రజాశక్తి

ఆదివారం 17 ఆగస్టు 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఖరీఫ్‌లో ఆటుపోటు



దుగ్గిరాల మండలంలో ఇటీవల వానలకు నీట మునిగిన వెదపద్ధతిలో సాగైన వరి పొలం

- సీజన్ ముగుస్తున్నా పూర్తవ్వని సేద్యం
- అతివృష్టి, అనావృష్టితో పెరిగిన ఇబ్బందులు
- పక్షం రోజుల్లో సీజన్ ముగుస్తున్నా 50 శాతం దాటని సేద్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆది నుంచి ఇప్పటి వరకు అనేక ఆటుపోట్లు ఎదురయ్యారు. పల్నాడు జిల్లాలో జూన్‌లో వర్షాభావం ఏర్పడింది. జులైలో వర్షాలు ఆశాజనంగా ఉన్నా కాల్వలకు నీరు విడుదల తేదీలు ఖరారు కాకపోవడంతో సేద్యం ముందుకు సాగలేదు. ఆగస్టులో మళ్లీ 10 రోజులు వర్షాలు కురకపోయినా 11వ తేదీన ప్రారంభమైన వర్షాలు 14వ తేదీ వరకు కొనసాగాయి. ఆగస్టులో అతివృష్టి పరిస్థితులు ఏర్పడ్డాయి. నెల రోజుల వ్యవధిలో కురవాల్సిన వర్షం ఒక్క రోజుల్లోనే కురవడంతో సాగు చేసిన పైర్లకు ముంపు సమస్య ఏర్పడింది. ఇప్పటి వరకు వర్షాలు లేక, విత్తనాలు దొరక్క, ఏ పంట వేయాలో తెలియని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న రైతులకు అధిక వర్షాలతో పొలాల్లో నీరు నిలబడటంతో సాగు ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి.

ఖరీఫ్ సీజన్ ఈనెల 31తో ముగియనుంది. కానీ ఇప్పటి వరకు గుంటూరు జిల్లాలో 2.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 1.33 లక్షల ఎకరాల్లోనే పంటలను సాగు చేశారు. ప్రధానంగా 1.54 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా ఉండగా ఇప్పటి వరకు 1.03 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. సాగు చేసిన ఈ విస్తీర్ణంలో ఇటీవల అధిక వర్షాలకు 70 వేల ఎకరాల్లో వరి పైర్లు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. వెదపద్ధతిలో సాగు చేసిన ఈ పైరు దెబ్బతినడంతో మళ్లీ పంట వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాట్లు వేసేందుకు సమయం లేదని, అవకాశం ఉంటే మళ్లీ వెదపద్ధతిలో సాగు చేయాల్సి ఉంటుందని లేదా వేరే సాగు చేయాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు సాగవ్వని మరో 51 వేల ఎకరాల్లో రానున్న 15 రోజుల్లో వరి నాట్లు పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలో 55 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 26 వేల ఎకరాల్లోనే వేశారు. మరో 4 వేల ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేశారు.

పల్నాడు జిల్లాలో 4.55 లక్షల ఎకరాల్లో పంటలను సాగు ▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు నిరసనలు

- సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. నరసరావుపేటలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు చంద్రకళ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావొస్తున్నా మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు ఇచ్చిన ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. ఈ నెలలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల మొదటి రోజున అన్ని మున్సిపల్ కేంద్రాల్లో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామనే హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 17 రోజుల సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేలు, ఎక్స్‌గ్రేషియో రూ.5 లక్షల నుండి రూ.7 లక్షలకు పెంచి అమలు చేయాలని కోరారు. క్లాప్ డ్రైవర్లకు ▶ 2లో



ఐకానిక్ టవర్ల వద్ద నిలిచిన నీటిని ఇంజన్లతో తోడివేస్తున్న దృశ్యం

ఐకానిక్ టవర్ల నిర్మాణ ప్రాంతంలో

పునాదుల్లో నీటి తోడివేత

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో ఐకానిక్ టవర్ల పునాదుల్లో చేరిన నీటిని తోడివేసే ప్రక్రియ కొనసాగుతోంది. రెండ్రోజులుగా నాలుగు ఇంజిన్లతో నీటిని తోడివేస్తున్నారు. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ సెక్రటేరియట్, హెచ్ఒడి కార్యాలయాల నిర్మాణ టెండర్లను ఎన్‌సిసి సంస్థ దక్కించుకుంది. సచివాలయంలోని జిఎడి టవర్‌ను ఈ సంస్థే నిర్మించనుంది. ఇంటిగ్రేటెడ్ సచివాలయంలోని 1, 2 హెచ్ఒడి టవర్ల నిర్మాణ పనులను షాపూర్ జీ పల్లోంజి సంస్థకు కేటాయించారు. రూ.1487.11 కోట్లతో ఈ టవర్ల నిర్మాణ పనులు చేపట్టనుంది. భారీ వర్షాలకు 1, 2 హెచ్ఒడి టవర్ల నిర్మాణ పునాదుల్లోకే నీరు పెద్దఎత్తున చేరింది. ఎన్‌సిసి సంస్థకు కేటాయించిన నిర్మాణ ప్రదేశంలోకి నీరు ప్రవేశించకుండా చుట్టూ మట్టిని అడ్డుగా ఉంచగా, షాపూర్‌జీ పల్లోంజి నిర్మాణ సంస్థ ఆ విధమైన చర్యలు తీసుకోలేదని, ఆ కారణంగానే నీరు చేరిందనే వాదనలున్నాయి. వైసిపి ఐదేళ్ల పాలనలో శాశ్వత సచివాలయం, హైకోర్టు భవన పునాదులు నీటిలోనే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగస్టు 2, 3 తేదీల్లో ఐఐటీ నిపుణుల బృందం జాతీయ విపత్తు నిర్వహణ బలగాల సాయంతో పునాదుల పటిష్టత, సామర్థ్యంపై ▶ 2లో



ఎత్తిపోతల ద్వారా విడుదలవుతున్న నీరు

ఎత్తిపోతల ద్వారా నీరు విడుదల

పొలాలకు తప్పని ముంపు బెడద

ప్రజాశక్తి- తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో దుక్కదాయనిగా పేరుగాంచిన కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రకాశం బ్యారేజ్ ఎగువన కొండవీటి వాగు హెడ్ స్లూయిస్ వద్ద గత టిడిపి ప్రభుత్వంలో రూ.187 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఈ పథకం పూర్తయితే తమ ▶ 2లో





సాగర్‌కు మళ్లీ పెరిగిన వరద

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం ఉదయం 14 గేట్ల ద్వారా నీటివిడుదలను కొనసాగించగా ఎగువ కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగటంతో మరో 6 గేట్లను ఎత్తి మొత్తం 20 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలోకి వరద నీరు పోటెత్తుతుండడంతో శ్రీశైలం జలాశయం 5 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,33,720 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుండి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతుండటం, ఇప్పటికే జలాశయం పూర్తిగా నిండిపోవడంతో 1,99,544 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం 20 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,56,760 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 587.50 అడుగుల వద్ద ఉంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 305.4050 టీఎంసీల నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,217 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా ▶ 2లో



నివాళి అర్పిస్తున్న మేయర్, కమిషనర్

సర్దార్ గౌతులచ్చన్నకు మేయర్, కమిషనర్ నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అంకిత భావంతో కషిచేసిన ప్రజానేత గౌతులచ్చన్న అని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా నగరంలోని బస్టాండ్ సెంటర్ వద్దగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతు లచ్చన్న ఒక స్వాతంత్ర్య సమరయోధుడని, నిస్వార్థ రాజకీయ నాయకుడు, పేదల ఆశాజ్యోతి అన్నారు. ఆయన జీవితం నిత్యం పోరాటాలతో ప్రజాసేవకు అంకితమైనదన్నారు. భావి తరాలు ఆయన పోరాట పటిమ, పేదల పట్ల ఆయన చూపిన సేవానిరతిని స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవలో పాల్గొనాలని అన్నారు. గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకొని ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. కావున గౌతు లచ్చన్నగారి ఆశయాల మేరకు నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ మంత్రి సర్దార్ గౌతులచ్చన్న 116వ జయంతి సందర్భంగా స్థానిక చుట్టుగుంటలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి సంఘ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోలా అశోక్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, జిల్లా యువనాయకులు యేటి కోటేశ్వరరావు, గౌస్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి

బిసి సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షులు జె వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు. స్థానిక రామలింగేశ్వరపేట బీసీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నాయకులు తొలుత నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గాంధీజీ పిలుపుతో స్వాతంత్రోద్యమంలో, ఉప్పు సత్యాగ్రహంలో, విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమంలో లచ్చన్న పాల్గొన్నారని, ఆ సమయంలో 40 రోజులు జైలు జీవితం గడిపారని తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్రోద్యమ నాయకునిగా, శాసనసభ్యునిగా మంత్రిగా పనిచేశారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జె శివరామకృష్ణ, వి సత్యనారాయణ, కె అచ్చయ్య, రమేష్, మురళి, ఎం జయకృష్ణ పాల్గొన్నారు.

ఎపియుడబ్ల్యూజె నగర నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు: ఎపియుడబ్ల్యూజె నగర నూతన కార్యవర్గం ఎన్నికైంది. శనివారం కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో యూనియన్ నగర మహాసభ నిర్వహించారు. ఈ మహాసభల్లో నగర నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కె.వెంకయ్య, బి.కార్తీక్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా కె.తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.వెంకటేశ్వరరావు, ఎ.వీరభద్రరావు, జి.అప్పారావు, కె.సుజిబాబు, రామ్‌భాస్కర్, కోశాధికారిగా షేక్.సుభాని, కార్యవర్గసభ్యులుగా డి.ప్రకాష్, సి.హెచ్. సుబ్బారావు, పి.లూర్దురాజు, వహీద్, రఘునాథరెడ్డి, పి.కోటేశ్వర రావు ఎన్నికయ్యారు. మహాసభల్లో యూనియన్ రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఏచూరి శివ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.భక్తవత్సలరావు, జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మీరా, కె.రాంబాబు తదితరులు పాల్గొని అభినందించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ ఇన్సూరెన్స్, ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం మొత్తం ఒకే వేతన విధానం అమలు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో నియమించిన బదిలీ కార్మికులకు రూ.9 వేలు నుండి రూ.12 వేలు వరకు మాత్రమే వేతనాలు ఇస్తున్నారని, వారికి కూడా రూ.21 వేలు చెల్లించాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు 4 ఏళ్ల నుండి నెలకొన్న సరెండర్ సెలవులకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పెరిగిన నిత్యవసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను దృష్టిలో పెట్టుకుని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులతో ప్రభుత్వం సత్వరం సంప్రదింపులు జరిపి సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, నాయకులు వెంకయ్య, వీరకుమార్, షేక్ చిన్న అల్లాబక్షు, సోమశేఖర్, కిరణ్ కుమార్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, జి.సామ్రాజ్యం పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ఆటుపోటు

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 1.25 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. ఇంకా 15 రోజుల వ్యవధిలో 3.30 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేయాల్సి ఉంది. దాదాపు లక్ష ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 4 వేల ఎకరాలల్లోనే వేశారు. 2.05 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉండగా చిలకలూరిపేట, వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల, పెదకూరపాడు, 1.19 లక్షల ఎకరాల్లో వేశారు. మరో రెండు వేల ఎకరాల్లో ఇతర పంటలు వేశారు. మిర్చిని పల్నాడు జిల్లాలో 20 వేల ఎకరాలు, గుంటూరు జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో వేశారు. రెండు జిల్లాల పరిధిలో రెండున్నర లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తారని అంచనాలు ఉండగా ఇప్పటి వరకు 25 వేల ఎకరాల్లోనే వేశారు. ఈ ఏడాది మిర్చి సాగు మరింత తగ్గుతుందని భావిస్తున్నారు. గతేడాది ధరల తగ్గుదల వల్ల ఈ ఖరీఫ్‌లో తగ్గే అవకాశం ఉంది. మొత్తంగా ఈ ఏడాది సీజన్ ముగింపు దశలో కూడా 50 శాతం విస్తీర్ణంలో పంటలు సాగు వేగం ఉత్సాహంగా జరగడం లేదు.

పునాదుల్లో నీటి తోడివేత

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించింది. పునాదులు పటిష్టంగానే ఉన్నాయని నిపుణుల బృందం చెప్పడంతో ప్రభుత్వం గత డిసెంబర్ 25 నుంచి పునాదుల్లోకి చేరిన నీటిని ఇంజిన్లతో తోడివేత చేపట్టింది. దాదాపు నెలరోజుల పాటు నీటి తోడివేత ప్రక్రియ కొనసాగింది. రెండ్రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో మళ్లీ ఇంటిగ్రేటెడ్ సచివాలయంలోని 1, 2 హెచ్ఒడి టవర్ల పునాదుల్లోకి నీరు చేరడంతో వాటిని తోడివేయిస్తున్నారు. ఈసారి కూడా నీటితోడివేత ప్రక్రియ దాదాపు నెలరోజులు పట్టే అవకాశం కనిపిస్తోంది.

ఎత్తిపోతల ద్వారా నీరు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పొలాలకు ముంపు సమస్య ఉండదని రైతులు భావించారు. అయితే ఇటీవల వానల వల్ల కొండవీటి వాగుతో పాటు కోటేళ్ల వాగు పోటెట్టడంతో ఉండవల్లి వద్ద వాగు ఉగ్రరూపం దాల్చింది. యతావిధిగా వాగు హెడ్ స్లూయిస్ వద్ద నీరు ఎగదన్ని పొలాలను ముంచెత్తింది. దీంతోపాటు రాజధాని నిర్మాణంలో ఉన్న అనేక భవనాల్లోకి నీరు చేరింది. వర్షాలు తగ్గుముఖం పట్టి రెండ్రోజులవుతున్నా ఉండవల్లిలోని ఎత్తిపోతల పథకం దగ్గర నీరు భారీగానే నిలిచి ఉంది. దీంతో రెండు పంపుల ద్వారా నీటిని వాగులో నుండి కృష్ణా నదిలోకి పంపుతున్నారు. మరోవైపు వాగులో గుర్రపు డెక్క, తూటు కాడ పెద్దఎత్తున పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో దీన్ని తొలగించేందుకు ఇరిగేషన్ అధికారులు రెండు పొక్లెయినర్ల ద్వారా పనులు చేస్తున్నారు.

సాగర్‌కు మళ్లీ పెరిగిన వరద

(మొదటి పేజీ తరువాయి)

6006 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 2067 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులు, మొత్తం 1,95,450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పర్యాటకుల సందడి - పోలీసు బందోబస్తు

శనివారం సెలవు కావడంతో నాగార్జునసాగర్‌లో శనివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. నూతన వంతెన, జలవిద్యుత్ కేంద్రం పరిసరాలు, లాంచీ స్టేషన్, పాత వంతెన తదితర ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రలతో పాటు వివిధ రాష్ట్రాల నుండి పర్యాటకులు వందల సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. ఉదయం నుండి పర్యాటకుల తాకిడి పెరగటంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా స్థానిక పోలీసులు బందోబస్తును కట్టుదిట్టం చేశారు.

వర్సిటీలో నూతన డ్రెయినేజీ వ్యవస్థ

వర్షపు నీరు నిలవకుండా చర్యలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు



డ్రెయినేజీ నిర్మాణం పనులను పర్యవేక్షిస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వర్షపు నీరు నిలవకుండా డ్రెయినేజీ నిర్మాణం పనులు చేపట్టారు. ప్రస్తుతమున్న డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం తోపాటు మరమ్మతులకూ వీలులేని స్థితిలో ఉంది. దీంతో భారీ వర్షం పడినప్పుడల్లా వర్సిటీ గ్రంథాలయంతో పాటు పరీక్ష భవన్ ఎదురుగా ఉన్న రోడ్డు వైపు హెచ్ఆర్ఎం, హిందీ, సైకాలజీ తదితర విభాగాల పరిసరాల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయంగా ఉంటోంది. వర్సిటీ పక్కనే ఉన్న గుంటూరు ఛానల్ ఉధృతంగా ప్రవహిస్తూ పొంగినప్పుడల్లా ఆ నీరు కూడా వర్సిటీ బాలుర వసతి గృహాల్లోకి వస్తున్నాయి. ఈ ఇబ్బందులన్నీ తొలగించడానికి తాజా డ్రెయినేజీల నిర్మాణం ఉపకరిస్తుందని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. దీనిలో భాగంగా వర్సిటీలోని రోడ్డు కింది భాగంలో ప్రత్యేక తూములను ఏర్పాటు చేస్తుండగా పనులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సింహాచలం శనివారం పరిశీలించారు. పనులు పూర్తి చేయించే బాధ్యతను ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళికి అప్పగించారు.

శాంతి భద్రతలతో వినాయక చవితి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు : వినాయక చవితి శాంతి భద్రతల నడుమ చేసుకోవాలని గుంటూరు జిల్లా సౌత్ సబ్ డివిజన్ డిఎస్‌పి జి.భానోదయ అన్నారు. శనివారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ ఎన్ నరహరి అధ్వర్యంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో రాజకీయ పార్టీలకు అతీతంగా పండుగ జరుపుకోవాలన్నారు.

పలుచోట్ల ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి- తాడేపల్లి

శనివారం తాడేపల్లి నెహ్రూ బొమ్మ సెంటర్లో ఉన్న కృష్ణుడు గుడి వద్ద జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. స్థానిక శ్రీకృష్ణ యూత్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 4000 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, సిపిఎం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు


శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా శేకూరు గ్రామంలోని శ్రీ కృష్ణ మందిరం లో గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన



ప్రత్యేక పూజలో స్థానిక శాసన సభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు . తదుపరి మందిరం వద్ద మంచినీరు బోరు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, మండల ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మి నారాయణ. జనసేన, బీజేపీ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

పండుగలు, ఆచార వ్యవహారాలు దేశ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడతాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక గంగానమ్మపేటలో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం శ్రీకష్ణ భక్త బృందం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేకంగా నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాష్టమి వేడుకలు ప్రజల ఐక్యతకు చిహ్నంగా జరుగుతున్నాయని, నిర్వాహక బందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ భక్త



బృందం పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల

మండలంలోని అనేక గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం దుగ్గిరాల లోని శివాలయం సెంటర్ వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించిన శ్రీకృష్ణుని విగ్రహం వద్ద పూజలు ప్రారంభించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రైలు పేటలో మధ్యాహ్నం సాముహిక భోజనాలను ఏర్పాటు చేశారు. . దుగ్గిరాలతో పాటు చింతలపూడి ఈమని పేరు కలపూడి కంఠంరాజు కొండూరు తదితర గ్రామాలలో



రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని వంకాయలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న బైక్‌పై భార్యాభర్తలు వస్తున్నారు. అదేమార్గంలో వేగంగా వస్తున్న స్కూటీ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. భార్యాభర్త లిద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వారిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో జూదరులు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని లింగారావు పాలెం నుంచి సొలస వెళ్ళు దారిలో కోత ముక్క ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎస్సై టి. శివరామకృష్ణ సిబ్బందితో దాడి చేశారు. కోత ముక్క ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.19,200 స్వాధీనం చేసుకున్నారు.



బస్టాండ్ ఆవరణలో చెట్లను తొలగిస్తున్న రాజశేఖర్

ఆర్టీసీ ఆవరణలో స్వచ్ఛత సేవ

ప్రజాశక్తి-తెనాలి రూరల్

స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా బస్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలిగించినట్లు ఆర్టీసీ డిపో మేనేజరు ఎ. రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80మంది సిబ్బందితో బస్టాండ్ పరిసరాలను శుభ్రపరిచామని తెలిపారు. అనంతరం స్వచ్ఛత సేవ కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పించి, స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు.

ఈ-శ్రామ్ కార్డులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - మేడికొండూరు

అసంఘటిత రంగంలోని కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించడంతోపాటు, సంఘటిత రంగ కార్మికులతో సమానంగా ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ పోర్టల్‌ను అసంఘటిత రంగ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రకార్మిక సంఘం అధ్యక్షులు బండారి బ్రహ్మయ్య తెలిపారు. పేరేచర్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోర్టల్ ద్వారా దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి అన్ని ప్రభుత్వ పథకాల, ప్రయోజనాలను వారికి అందజేయడమే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ఇందుకోసం కూలీలకు ఈ-శ్రమ్ కార్డులు అందజేస్తారని తెలిపారు. ఈ-శ్రమ్ కార్డు కార్మికులకు ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక కార్డు అన్నారు. కార్డు పొందిన కూలీలు దేశంలో ఎక్కడైనా ఉపాధి పొందడం సులభం అవుతుంది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన కార్మికుడికి రూ.2 లక్షల ప్రమాద బీమా కవరేజీ ఉంటుం దన్నారు. పోర్టల్‌లో నమోదైన కార్మికుడు ప్రమాదానికి గురైతే, మరణం లేదా పూర్తి అంగవైకల్యం సంభవించినప్పుడు రూ.2 లక్షల మొత్తం ఇస్తారని తెలిపారు. అదే సమయంలో కార్మికుడు పాక్షికంగా అంగవైకల్యం కలిగి ఉంటే ఈ బీమా పథకం కింద రూ.లక్షకు అర్హులు అవుతారన్నారు. ఈ కార్డు సహాయంతో అసంఘటిత రంగ కార్మికులకు ప్రధాన మంత్రి శ్రమ యోగిమాన్ ధన్ యోజన, స్వయం ఉపాధి కోసం జాతీయ పెన్షన్ పథకం, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రజా పంపిణీ వ్యవస్థ, ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన, జాతీయ ప్రభుత్వ పథకాలైన సామాజిక సహాయ పథకం, ఆయుష్మాన్ భారత్, నేత కార్మికులకు ఆరోగ్య పథకం, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం వంటి వాటి ద్వారా ప్రయోజనం పొందుతారని తెలిపారు. నమోదు ప్రక్రియ, షరతులు ఏమిటి అసంఘటిత రంగంలో పని చేసే 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ కార్డు కోసం నమోదు చేసుకోవచ్చు. వర్కర్ స్వయంగా లేదా ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా కామన్ సర్వీస్ సిఎస్‌సి సెంటర్, మీసేవ సెంటరని సందర్శించడం ద్వారా నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు



చెక్కును అందజేస్తున్న టిడిపి నాయకులు

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల కు చెందిన 34మంది లబ్ధిదారులకు రూ.44,45, 104ల సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం సాయంత్రం ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసన సభ్యులు జీవీ ఆంజనేయులు తన కార్యాల యంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో అండగా నిలుస్తోం దన్నారు. పార్టీలకతీతంగా కేవలం అర్హత ప్రామాణికంగా ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తుందన్నారు. సీఎం సహాయ నిధులు మంజూరు చేయించిన ఆంజనేయులుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామానికి చెందిన మక్కపాటి లక్ష్మిఅన్నపూర్ణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆమె కుటుంబ ఆర్థిక ఇబ్బందులను ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకు వెళ్ళారు. స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి లక్ష్మీ అన్నపూర్ణ పరిస్థితిని వివరించారు. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు రూ.11 లక్షలను సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరు చేయించారు. కార్యక్రమంలో చిర్రావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మక్కపటి వెంకటకబుష్ణరావు, కొంకా ముసలయ్య, దవులూరి అనిల్, కంచర్ల కోటేశ్వరరావు, పందిరి వెంకన్న పాల్గొన్నారు.

యువకునిపై కత్తితో దాడి

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణం వెన్నపూస కాలనీకి చెందిన గనుపు నాగమయ్య అనే యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన పిడతల సుధాకర్ అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో బంధువులందరూ కలిసి మాట్లాడుకుంటుండగా విడతల సుధాకర్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. అడ్డు వచ్చిన నాగమయ్యను పొడవడంతో అక్కడే కుప్ప కూలిపోవడంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు బాధితుడి అన్న గనుపు కోటేశ్వరావు తెలిపారు. వైసిపి నాయకులు పిడతల సుధాకర్, పిడతల బాజీ, చిన్నబాబు, వెంకటరత్నం, దేవదాసు ప్రోద్భలంతో విడతల సుధాకర్ కత్తితో దాడి చేసి హత్య యత్నం చేసినట్లు వినుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కోటేశ్వరావు తెలిపారు. ప్రస్తుతం గాయపడ్డ నాగమయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.



పల్నాడు కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



వినుకొండ గీతమ్స్ బ్లూమ్స్ పాఠశాలలో...

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కృష్ణా ష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు బాల కృష్ణుడు గోపికల వేషధారణలో కృష్ణుడు గీతాలకు నాట్యం చేస్తూ అలరించారు. స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయడంలో భాగంగా కృష్ణాష్టమి పండుగ విశిష్టత, పిల్లలకు కృష్ణుడి జీవితం నుంచి నేర్చుకోవలసిన విషయాలను వివరించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్ క్యాంపస్ ఇంచార్జికోట బాపూజీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక పల్నాడు రోడ్డులోని గీతమ్స్ బ్లూమ్స్ పాఠశాలలో శ్రీ కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరయ్యారు. చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక మెయిన్ బజారులోని శ్రీ వివేకానంద హైస్కూల్ వారి ఆధ్వర్యంలో శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం నిర్వహించారు. చిన్నారులు పిల్లలు గోపికలు, శ్రీకష్ణుడి వేషాలలో ఆటపాటలు, క్యూట్ ప్రోగ్రామ్స్ ప్రదర్శించారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, స్కూల్ డైరెక్టర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పాల్గొని శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. టీడీపీ నాయకులు, రాజబోయిన మధు, నేరేటి వీరస్వామి, జల్లెల కొండలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పలువురికి తీవ్ర గాయాలు
ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - మేడికొండూరు



గాయపడిన లిల్లీరాణి

మేడికొండూరు మండల పరిధిలోని గుండ్ల పాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మేడికొండూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిరిపురం గ్రామానికి చెందిన మహిళలు నల్లపాడు పరిధిలో వివాహ శుభకార్యానికి వెళ్లేందుకు గ్రామంలో పాటిబండ్ల నుండి వస్తున్న ఆటో ఎక్కారు. మేడికొండూరు పోలీస్‌స్టేషన్ దాటిన తర్వాత గుండ్ల పాలెం వద్ద ఎదురుగా గేదె అడ్డు రావడంతో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. ప్రయాణి కులు ఎక్కువగా ఉండటం వల్ల ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. లిల్లీరాణి అనే మహిళపై ఆటో పడి కూత వేటు దూరానికి ఆటో లాక్కొని వెళ్లడంతో పక్కటెముకలు దెబ్బతిన్నాయి. కుడిచేతికి, ఒంటికి గాయాలయ్యాయి. తలకు తీవ్రగాయం రావడంతో పరిస్థితి విషమంగా మారింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కానిస్టేబుళ్లను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలోని తిక్కిరెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన నేలటూరినీరజ, మామిడి విజయ్‌కుమార్, కొండమూరి పవన్ కుమార్‌ను బి.ఆర్.అంబేద్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు అభినందన సభ ఏర్పాటు చేసి అభినందించారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించి మెమోటో అందజేశారు.



మాట్లాడుతున్న ఎస్ఐ మణికృష్ణ

చోరికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -రొంపిచర్ల

మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో మూడు నెలల కిందట అదే గ్రామంలోని ఓ ఇంట్లో చోరికి పాల్పడి సుమారు రూ. 13 లక్షలవిలువైన బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం అపహరించిన వ్యక్తిని శనివారం రొంపిచర్ల పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దీనికి సంబంధించి ఎస్సై సిహెచ్ మణికృష్ణా తెలిపిన వివరాల మేరకు సంతగుడిపాడు గ్రామానికి చెందిన నామాల మీనా అనే మహిళ గృహంలో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన గాలంరాజేష్ చోరికిపాల్పడ్డాడు. రాజేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడన్నారు. అతని వద్ద నుండి చోరిసొత్తు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టు హాజరుపరిచినట్లు ఎస్సై మణి కృష్ణ తెలిపారు.

సమస్య ఉంటే 1100కు ఫోన్ చేయండి

రేపు యథావిధిగా గ్రీవెన్స్ : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలు నమోదు చేసుకోవడానికి meekosam.ap.gov.in వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహిస్తామని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యల అర్జీలను అందజేయాలని. గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైతే ఫోన్‌కు సందేశం వస్తుందని పేర్కొన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్‌ను వాట్సప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ అడ్రస్‌కు పంపిస్తున్నామని, రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలని సూచించారు.

ఉట్టి కొట్టిన ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్




సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లిలో శనివారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ఉట్టి కొట్టారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, మస్తాన్ వలి, నాయకులు వై.రామస్వామి, జాన్‌బాబు, పి.వెంకటకోటయ్య, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఎన్ఆర్ఐ సాయం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని కట్టావారిపాలెం మండల పరిషత్ పాఠశాల అభివృద్ధికి ప్రవాస భారతీయుడు ఆర్థిక సహాయం చేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా పాఠశాలలో జెండా ఆవిష్కరణతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలో బొమ్మలు వేసేందుకు ప్రవాస భారతీయుడు మదమంచి రామకృష్ణ రూ.20 వేల చెక్కును పాఠశాల హెచ్ఎం వడ్లమూడి శ్రీలక్ష్మికి అందచేశారు. స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కోయ నరసింహారావు రూ.15 వేలతో కుర్చీలను సమకూర్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొబ్బరి సుబ్బారావు, మదమంచి రాంబాబు, ఎం.జానికిరావు, కోయ లక్ష్మయ్య, ఎంపిటిసి దేవినేని అనురాధ, ఉపాధ్యాయులు చందన పాల్గొన్నారు.



కార్పొరేట్ సెలూన్లకు వృత్తిదార్ల నిరసన

ప్రజాశక్తి - అమరావతి



నాయీ బ్రాహ్మణ క్షవర వృత్తిదారులు జీవన విధానంపై కార్పొరేట్ సెలూన్ షాపుల ప్రమాదాన్ని నిరసిస్తూ వృత్తిదార్లు ఆందోళన చేపట్టారు. మండల కేంద్రమైన అమరావతిలోని మెయిన్ రోడ్‌లో కార్పొరేట్ సెలూన్ల ఎదుట శనివారం నిరసన ప్రదర్శన చేశారు. తరతరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న తమ పొట్టకొట్టొద్దని నినదించారు. కాస్మోటిక్ వస్తువుల ధరలు, షాపు అద్దెలు, కరెంటు బిల్లులు పెరిగి ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని, ఇప్పుడు కార్పొరేట్ సెలూన్లు వస్తే తమ కుటుంబాలంతా రోడ్డున పడాలని వాపోయారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు తుళ్లూరు కోటేశ్వరరావు, అమరావతి అధ్యక్షులు చింతపల్లి శివప్రసాదరావు, నాదెండ్ల నాగమల్లేశ్వరరావు, నిడుముక్కల సాంబశివరావు, మార్క్యాపురం పూర్ణ, బి.సుబ్బు, బి.వెంకటేశ్వరరావు, జి.హనుమంతరావు, ఆంజనేయులు, సిఐటియు నాయకులు బి.సూరిబాబు పాల్గొన్నారు.

యాప్‌ల భారం.. బోధనకు దూరం..



ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రభుత్వాలు మారినా విద్యా విధానంలో మార్పు రాలేదు. ఏమైనా కొద్ది మార్పుల తెచ్చినా అవి బెంచీలు, గోడలకు రంగులు మినహా బోధనా పరమైన అంశాల్లో కీలక అంశాలు విస్మరణకు గురవుతూనే ఉన్నాయి. బోధన ప్రధానంగా ఉండాల్సిన ఉపాధ్యాయులకు కొసరు పనులను అధికంగా అప్పగిస్తూ అందుకు యాప్‌లను తగిలించి అసలు బాధ్యతపై కేంద్రీకరణ తగ్గిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే యాప్ తలనొప్పులను తీసేస్తామనే హామీని కూటమి ప్రభుత్వం విస్మరించడతోపాటు మరిన్ని యాప్‌లను తెచ్చింది.

విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా పిల్లల చదువులు గాడన పడలేదని తెలుస్తోంది. ఉపాధ్యాయులు తగినంతగా బోధనకు సమయాన్ని కేటాయించే వీలు లేకుండా పోయింది. యాప్‌లతో కుస్తీ పట్టడం ఒకటైతే జూన్‌లో జరిగిన బదిలీలు, ప్రమోషన్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాలేదు. బదిలీ ఉత్తర్వుల్లో మార్పులపై ఆర్థికశాఖ అనుమతి పొందక పోవడం, కేడర్ స్ట్రెంగ్త్, పొజిషన్ ఐడిల సమస్యలు పరిష్కారం కాకపోవడం వంటివి నెలకొన్నాయి. అకడమిక్ అంశాలతో పెద్దగా సంబంధం లేని యోగాంధ్ర, పిటిఎం, ఇతర శిక్షణలు, ప్రచార కార్యక్రమాలపై కేంద్రీకరణ కారణంగా సమయం వృథా అవుతుందనే విమర్శలు వస్తున్నాయి. త్వరలో పార్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు జరగనున్నాయి. ఇన్ని గందరగోళాలల మధ్య ఈ పరీక్షలకు విద్యార్థులను ఉపాధ్యాయులు ఎంతవరకు సిద్ధం చేయగలరనేదీ ప్రశ్నార్థకమే.

ప్రతిరోజూ ఏదో ఒక అత్యవసర సమాచారం పేరుతో విద్యాశాఖ ఒత్తిడి తెస్తోంది. అనేక వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలనే ఆదేశాలిస్తోంది. ఉపాధ్యాయులకు సంబంధం లేని 24 రకాల పనులను యాప్‌ల పేరుతో వారిపై మోపుతున్నారు. మొక్కలు నాటించడం, వాటిని యాప్‌లో అప్‌లోడ్ చేయడం, మధ్యాహ్న భోజనం వివరాలు యాప్‌లో నమోదు చేయడం వంటివి ఉపాధ్యాయులు బోధనా విధులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. కొన్ని పాఠశాలలకు సరిపడా ఉపాధ్యాయుల్లేరు. ఉన్న ఉపాధ్యాయులే విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, ఇతర మెటీరియల్‌ను మండల కేంద్రం నుండి పాఠశాలలకు చేర్చుకోవాల్సి వచ్చింది. వీటన్నింటి వల్ల విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఉపాధ్యాయులతోపాటు విద్యారంగ ప్రముఖులూ చెబుతున్నారు. ఈ సమస్యల పరిష్కారం, ఖాళీల భర్తీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించాలని ప్రభుత్వ రంగ విద్య పరిరక్షకులు కోరుతున్నారు.



కలుషిత నీటి వల్లే ఎక్కువ వ్యాధులు

ఎంపిపి పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ఆనందపేటలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ సౌజన్యంతో మంచికలపూడి గ్రామానికి చెందిన కొండపనేని నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు సాంబశివరావు, సుబ్బారావు, మౌళయ్య దీన్ని ఏర్పాటు చేయగా వారి కుమారులు శ్రీనివాసరావు, విజయ్‌కృష్ణ, మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండపనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషికి గాలి తర్వాత నీరు అత్యంత ముఖ్యమైనదని, కలుషిత నీటి వల్లే అనేక వ్యాధులు వస్తాయని చెప్పారు. వాటి నుండి విద్యార్థులను తప్పించడానికే వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం దాతలను హెచ్ఎం, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

పేదల కోసం పోరాడిన గౌతు లచ్చన్న



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న 116 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శనివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేట కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.శ్రీనివాసరావు పూల మాలలేసి నివాళులర్పించారు. రైతు ఉద్యమ కారకుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని యువతకు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, జమీందారీ వ్యతిరేక పోరాటం, హరిజన సేవ, మద్యపాన నిషేధం కోసం ఆయన పాటుపడ్డారన్నారు. పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం శ్రమించారని, ఆయన చూపిన ఆత్మీయత, త్యాగం, పోరాటస్ఫూర్తిని అందరూ అలవర్చుకోవాలని అన్నారు. చిన్ననాటి నుంచే సామాజిక చైతన్యంతో స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, ఎమ్మెల్యేగా, మంత్రిగా విశేష సేవలందించారన్నారు. గిరిజన, రైతు, కూలీల హక్కుల కోసం నిరంతర పోరాటం చేసిన యోధుడన్నారు. నివాళులర్పించిన వారిలో అదనపు ఎస్‌పి జెవి సంతోష్, ఎఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీరెడ్డి, ఆర్ఐ ఎస్.కృష్ణ, ఎఎన్ఎస్ ఆర్ఐ యువరాజ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

విస్తారంగా కూరగాయల సాగు

ప్రజాశక్తి -రొంపిచర్ల

ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర దక్కక అప్పుల పాలవుతున్న రైతులకు కూరగాయల సాగు కాస్తంత ఆశాజనకంగా కనిపిస్తోంది. మండలకేంద్రమైన రొంపిచర్లతోపాటు పలు గ్రామాల్లో 250 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల సాగు చేస్తున్నారు. అన్నవరం, తుంగపాడు, విప్పర్లపల్లి, వీరవట్నం, సంతగుడిపాడు తదితర గ్రామాల్లో బెండ, వంకాయ, దొండ, పందిరి పొట్ల, దోస, మునగ, కాకర తదితర కూరగాయలు సాగు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నుండి సరైన ప్రోత్సాహం అందడం లేదని, అందుకే కూరగాయల సాగులోనూ నష్టాల గాయాలు తప్పడం లేదని రైతులు చెబుతున్నారు. ఒక ఎకరంలో కూరగాయల సాగుకు కనీసం రూ.25 వేల నుండి రూ.40 వేల వరకూ పెట్టుబడి అవుతుంది. దీనికితోడు పంటలకు ఆశించే చీడపీడల నిర్మూలన కోసం రూ.వేలల్లో ఖర్చు పెట్టాలి. ఇలా నానా తంటాలు పడి పంటను దక్కించుకున్నా వాటికి సరైన ధర దక్కడం లేదనేది రైతు ఆవేదన. ఈ విషయంలో ప్రభుత్వం తమకు సహకారం అందించాలని రైతులు కోరుతున్నారు.



సమస్యల నిలయాలు టిడ్కో గృహాలు



ఇటీవల కురిసిన వర్షాలతో నీటిలో ఉన్న గృహ సముదాయం



మంగళగిరిలోని టిడ్కో గృహ సముదాయం..

మంగళగిరి పట్టణంలోని టిడ్కో గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. కొద్దిపాటి వర్షానికే గృహ సముదాయాలు మునిగిపోతున్నాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నెలలో నాలుగైదు రోజులు నీరు రావడం లేదని వాపోతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉంది. మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. దీంతో వ్యాధుల బారిన పడతామని ప్రజలు వాపోతున్నారు. ఇన్ని సమస్యలున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చీకటి పడితే గంజాయి, మద్యం సేవించే యువకుల హల్చల్ చేస్తున్నారని చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి...

ప్రజాశక్తి - మంగళగిరి

2015 టిడిపి ప్రభుత్వ హయాంలో మంగళగిరిలో టిడ్కో గృహాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. 2019 జనవరి నాటికి 90 శాతం పనులు పూర్తయ్యాయి. మొత్తం 1728 గృహాలను నిర్మించారు. 2019లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 10 శాతం ఉన్న పనులను వైసీపీ ప్రభుత్వం 2023 నాటికి పూర్తి చేసింది. డ్రెయినేజి, సీసీ రోడ్డు నిర్మాణాలను పూర్తి చేశారు. గృహాలకు తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంక్ నిర్మాణం చేశారు. చివరలో హడావుడిగా ప్రారంభించారు. 2024లో మళీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వాటర్ ట్యాంక్ ద్వారా నీళ్లు అందించాల్సి ఉండగా వాటర్ సక్రమంగా రావడం లేదని చెప్పి ఆటో నగర్‌లో ఏర్పాటు చేసిన వాటర్ స్కీం ద్వారా గృహాలకు వాటర్ పంపిణీ చేస్తున్నారు. నెలలో నాలుగు ఐదు రోజులు వాటర్ రావడం లేదని గృహ సముదాయంలోని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగటానికి మాత్రం మినరల్ వాటర్ ప్లాంట్‌ను దాతల సహాయంతో నిర్మాణం చేశారు. మినరల్ వాటర్ ప్లాంట్ నుండి ఒక్కొక్క డబ్బా ఐదు రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా గృహ సముదాయాల్లో లీకేజీ సమస్య అధికంగా ఉందని వాపోతున్నారు. సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ వచ్చి సున్నం రాసి పోతున్నారే గాని లీకేజీలు మాత్రం ఆగడం లేదని వాపోతున్నారు. అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు. డ్రైనేజీలో మురుగుపారుదల సక్రమంగా లేకపోవడం వలన దోమలు పెరిగి, దోమకాటుకు గురై అనారోగ్యమునకు గురవుతున్నామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఈ విధంగా ఏర్పడిందని తెలిపారు. ఇటీవల డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం డ్రైనేజీ నిర్మాణం చేపట్టింది. ఇంకా పూర్తి కావలసి ఉంది. కాగా కొద్దిపాటి వర్షానికి నీళ్లు నిల్వ ఉండిపోతున్నాయని వాపోయారు. ఇటీవల కురిసిన వర్షాల మెట్లు దాకా నీళ్లు వచ్చాయి. బయటికి వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ పట్టించుకునే నాధుడే లేరని వాపోతున్నారు. నెల నెల కిస్తీలు బ్యాంకుకు చెల్లించకపోతే బ్యాంక్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. బ్యాంకు వారు గఅహ సముదాయంలో బ్యానర్లు కూడా పెట్టడం జరిగింది. సకాలంలో చెల్లించాలని, లేకపోతే పెనాల్టీలు పడతాయని, వడ్డీలు భారం పెరుగుతుందని బ్యానర్లో పెట్టారు. అదేవిధంగా గఅహ సముదాయంలో చీకటి పడితే గంజాయి, మద్యం తాగి యువకుల హల్చల్ పెరిగిపోతుందని గృహ సముదాయంలోని నివాసితులు వాపోతున్నారు. అనేక పర్యాయములు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది అని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!



కృష్ణా నది ఒడ్డున చిన్నపిల్లలతో ఆటలు



ప్రజాశక్తి- తాడేపల్లి

ప్రకృతి విలయతాండవం ఒక్కోసారి ఒళ్ళు గగుర్పాటుకు గురిచేస్తుంది. అటువంటి ప్రకృతితో అభం శుభం తెలియని చిన్నారులతో కలిసి ఆటవిడుపు కోసం ఆటలాడతారా...? వద్దే వద్దు అంటున్నారు పోలీసులు. అయినా పర్యటకు లెక్క చేయటం లేదు. నీళ్లను చూస్తే ఎవరికైనా ఉత్సాహంతో పాటు కేరింతలు, సరదాలు పరిపాటి. ఒక్కోసారి ఆ కేరింతలు, సరదాలే ప్రాణం మీదకు తెస్తాయి. ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది ఉగ్రరూపం దాల్చింది. సుమారు ఐదులక్షల నీరు బ్యారేజీ దిగువకు సముద్రంలోకి వదులుతున్నారు. సీతానగరం వీరాంజనేయ కోదండ రామాలయం ఎదురుగా గల పుష్కరాల మెట్ల పైకి నీళ్లు వచ్చి చేరాయి. ఈ మెట్ల దగ్గరే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అనేక మంది పర్యాటకులు తమ పిల్లలతో ఆటలాడుతున్నారు. ప్రమాదకరమైన ఈ సంతోషం ఎటు దారి తీస్తుందని అక్కడ ఉన్న గజ ఈత గాళ్లు, పోలీసులు ఆందోళన చెందుతున్నారు. పోలీసుల హెచ్చరికలను లెక్కచేయడం లేదు. కృష్ణా నది పరవళ్ళు దగ్గరగా చూడాలని కోరుకుంటున్నా వీరికి ఆ ప్రాంతంలోనే సుడిగుండాలు ఉన్నాయని తెలియదు. ఒక్క మెట్టు పొరపాటున జారిన ఊహించడానికి వీలు లేని ఉపద్రవం జరిగే ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదపుటంచుల్లో ఆటవిడుపు అవసరమా అని స్థానికులు నిట్టూరుస్తున్నారు. పోలీస్ అధికారులు స్థానికులను హెచ్చరిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆ ప్రాంతాల్లోకి ఎవరిని అనుమతించకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సెలవు రోజు కావడంతో వందల మంది సీతానగరం ఘాట్ల వద్దకు వస్తున్నారు. ఫోటోలు,వీడియోలు దిగడం...ఆటలాడడం వంటివి చేస్తున్నారు. కృష్ణమ్మ ఉగ్రరూపానికి స్థానిక మత్స్యకారులే నది వైపు వెళ్లేందుకు సాహసం చేయటం లేదు

ఎకరాకి పదివేలు, విత్తనాలు ఇచ్చి రైతుల్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

ఇటీవల కురిసిన వర్షాలకు పంట మునిగి నష్టపోయిన రైతులకు ఎకరాకి పదివేలు, విత్తనాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. మండలంలోని శలపాడు, శేకూరు, వి.ఎన్.పాలెం గ్రామాల్లోని వరి పొలాలను ఆయన శనివారం సందర్శించారు. వరద ముంపు వలన సుమారు 5000 ఎకరాలు ఎదబెట్టిన వరి పైరు దెబ్బతిందని శలపాడు రైతులు ఆయన దృష్టి తీసుకొచ్చారు. శలపాడు, సుద్దపల్లి గ్రామాలకు మధ్య జాగిరి వంతెన మునిగిపోవడంతో పాటు, ఐదారు చోట్ల పంట కాలువలకు గండ్లు పడి మొలక దశలో ఉన్న చేలను ముంపునకు గురయ్యాయని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా శలపాడుకు చెందిన రైతు కావూరి వాసుదేవరావు మాట్లాడుతూ ఐదు రోజుల క్రిందట



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి

కురిసిన భారీ వర్షం వల్ల శలపాడు వద్దగల జాగిరి వంతెన మునిగిపోయిందని, గుంటూరు నల్లా డ్రైన్ (కొడు)కు రెండు పెద్ద గండ్లు, ఐదు ఆరు చోట్ల చిన్న చిన్న గండ్లు పడి వరద పంటను ముంచెత్తిందన్నారు. తీవ్రంగా నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు మైలా శివశంకర్‌రావు మాట్లాడుతూ 50 సంవత్సరాలు నుండి గుంటూరు నుండి వచ్చే మురుగునీటితో ఆయిల్ ఇంజన్ల సహాయంతో ఈ వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు. ఏనాడు పెద్ద వడ్లపూడి హై లెవెల్ ఛానల్ నుంచి సాగునీరు రాలేదని వివరించారు. ఏరువాక సమయంలో వేసిన విత్తనాలు నీరు అందక ఎండిపోయాయని, ఇప్పుడు మొలకదశలో వరద ముంచెత్తిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హై లెవెల్ ఛానల్ ద్వారా సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాంబిరెడి మాట్లాడుతూ ప్రభుత్వం సత్వరమే ముంపుకు గురైన రైతు పొలాలను సర్వే చేసి ఎన్యుమరేషన్ ప్రక్రియ ప్రారంభించాలని వాస్తవ సాగుదారులకు ఎకరా భూమికి పదివేల రూపాయలు సహాయంతో పాటు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. గుంటూరు నల్ల డ్రైన్ 2 గండ్లు పూడ్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాతా శ్రీనివాసరావు కొడాలి శ్రీకర్ బాబు, గ్రామ రైతులు, కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న తహశీల్దార్ గోపాలకృష్ణ, సుబ్బరాజుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

బ్రెయిన్ డెడ్ మృతుడికి ప్రభుత్వ లాంఛనాలు

- రమేష్ ఆసుపత్రిలో అవయవదానం
- కుటుంబ సభ్యుల సహకారంతో పలువురికి ప్రాణదానం
- పరామర్శించిన ఎమ్మెల్సీ ఆలపాటి

ప్రజాశక్తి - తెనాలిరూరల్

అవయవదానంతో అనేకమందికి పునర్జన్మ ఇవ్వవచ్చని తాశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ అన్నారు. సోమ సుందరపాలెం గ్రామంలో బ్రెయిన్ డెడ్‌తో ఇటీవల మృతి చెందిన కె.సుబ్బరాజు అంత్యక్రియల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. అనారోగ్య కారణాలతో సోమసుందరపాలెంకు చెందిన కంచర్ల సుబ్బరాజు (61) ఆగస్టు 10న మృతిచెందారు. బ్రెయిన్ డెడ్ కారణంగా మృతి చెందినట్లు నిర్ధారించిన గుంటూరు రమేష్ హాస్పిటల్స్ వైద్యులు అవయవదానంపై అవగాహన కల్పించినట్లు, కుటుంబ సభ్యుల అనుమతితో కళ్ళు, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలను అవయవదానం చేసినట్లు తహశీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ప్రభుత్వం నిబంధనలతో లాంఛనంగా సుబ్బరాజు కుటుంభ సభ్యులకు ధ్రువపత్రం అందజేసి సన్మానించారు. మట్టిఖర్చులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించామన్నారు. మృతుని సతీమణి వెంకటలక్ష్మికి వీలైనంత త్వరలో పింఛను ఏర్పాటుచేసి, నివేశన స్థలం మంజూరుకు ప్రభుత్వపరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ సుబ్బరాజు పార్థివదేహాన్ని సందర్శించి నివాళిలర్పించారు. కుటుంభ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



స్కాలర్‌షిప్ అందజేస్తున్న కెనరాబ్యాంకు సిబ్బంది

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యా జ్యోతి మెగా సిఎస్ఆర్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడూరులో చదువుతున్న మెరిట్ విద్యార్థులకు కెనరా బ్యాంక్ నారాకోడూరు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారని ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు శనివారం తెలిపారు. కెనరా బ్యాంకు యాజమాన్యము బాలిక విద్యను ప్రోత్సహించే దానిలో భాగంగా షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగల్లో పాఠశాల స్థాయిలో తరగతి వారీగా ప్రథమ స్థానం సాధించిన బాలికలను 8 ,10 తరగతులు ముగ్గురుకి విద్యార్థులకు, 5 నుండి 7వ తరగతి ముగ్గురు విద్యార్థులకు నగదు పంపిణీ చేశారు. నారాకోడూరు కెనరా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కోటేశ్వరరావు, సిబ్బంది రామకృష్ణ విద్యార్థులకు బహూకరించారు. కెనరా బ్యాంక్ వారికి ధన్యవాదాలు తెలిపారు. పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి బండ్ల శ్రీనివాసరావు మెడల్స్, ఉపాధ్యాయ బృందం నగదు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా పాఠశాల విద్యార్థులుకు ఉపాధ్యాయ బృందం, దాతలు ఎం.ఏడుకొండలు , పి రాజ్యలక్ష్మి, ఎన్.రాధాకృష్ణ, కె.అరుణ్ జ్యోతి, ఎం.సల్మాకాటూన్, ఐ.చలపతిరావు, ఎ.శ్రీనివాసరావు, డి.వెంకట శ్రీనివాస్, కె .విజయలక్ష్మి, బి.శ్రీనివాసరావు నగదు బహుమతులు అందజేశారన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆర్.సుబ్బారావు పాఠశాల కమిటీ చైర్మన్ వి.గోపీనాథ్, సభ్యులు పి.భాస్కరరావు, ఉపాధ్యాయులు కె.ప్రసాద్, ఎం.వెంకటేశ్వర



పరిసరాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని వివిధ వార్డులలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పర్యటన చేపట్టారు. పట్టణంలోని శివ సంజీవయ్య కాలనీ, క్రైస్తవుల సమాధుల తోట ప్రాంతాలలో అండర్ డ్రైనేజీ వాటర్ లీకేజీ సమస్యలను పరిశీలించారు. అధికారులతో చర్చించి తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రయాణికులు, కండక్టర్‌తో మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్

ఇబ్బందులుంటే తెలపండి : సీఐ ప్రభాకర్

ప్రజాశక్తి - మాచర్ల

మహిళల ఉచిత ప్రయాణం వలన కండక్టర్లు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటే తెలియజేయాలని పట్టణ సీఐ ప్రభాకర్ అన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి ఏపిఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మొదలైంది. ఈ నేపథ్యంలో శనివారం సీఐ ప్రభాకర్ మాచర్ల డిపోలోని పలు బస్సుల్లోకి ఎక్కి ఉచిత ప్రయాణ వలన రద్దీ ఎక్కువై బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, బస్సు లోపల ఎమైనా ఇబ్బందులు పడుతున్నారా అని ప్రయాణికులను, కండక్టర్లును ప్రశ్నించారు. ఎప్పటిలాగే బస్సుల్లో రద్దీ ఉందని, ప్రస్తుతానికి తమకు సమస్య ఎదురు కాలేదని వారు తెలిపారు. ఉచిత ప్రయాణం పట్ల ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్యలుంటే పోలీసులకు తెలియపరచాలని సీఐ ప్రభాకర్ తెలిపారు.


పుస్తకాలు అందజేస్తున్న కమలారామ్

విద్యార్థులకు సామగ్రి అందజేత

ప్రజాశక్తి - వినుకొండ

79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు, జాషువా సమాఖ్య గౌరవాధ్యక్షులు, రచయిత జి. కమలారామ్ తల్లిదండ్రులు గొంట్లా వెంకమ్మ, రంగయ్య మెమోరియల్ ట్రస్ట్ తరఫున స్థానిక 8వవార్డు స్కూల్లోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర దినో త్స వం గురించి, మహనీయులు త్యాగాల గురించి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొని కమలారామ్‌ని అభినందించారు.

అమలుకు నోచుకోని ఉప ముఖ్యమంత్రి హామీలు

పోలీస్‌లకు సరెండర్ లీవ్స్, టీఏ, డిఏల బకాయిలు చెల్లించని ప్రభుత్వం

ఒక్కొక్క పోలీసుకు రూ. లక్షకు పైగా బిల్లు పెండింగ్

అవస్థలు ఎదుర్కొంటున్న పోలీస్ సిబ్బంది

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నేను కానిస్టేబుల్ కొడుకుని... పోలీసు కుటుంబాల కష్టాలు నాకు తెలుసు... తాము అధికారంలోకి రాగానే పోలీసుల పెండింగ్ బిల్లులు పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు పోలీసు సిబ్బందికి ఇచ్చారు. అధికారం చేపట్టి 14నెలలు గడుస్తున్నా పోలీసు కానిస్టేబుళ్ల సమస్యలు పట్టించుకోలేదు. ఏడాది దాటినా సరెండర్ లీవ్స్, టిఏ, డీఏ బిల్లులు నేటికీ చెల్లించలేదు. దీంతో పోలీసులు సొంత డబ్బు ఖర్చు చేసుకుని బిల్లులు జమకాక అనేక ఇబ్బందులు పడుతు న్నారు. చిలకలూరిపేటటౌన్, రూరల్‌మండల, నియోజకవర్గ పరిధిలో పోలీస స్టేషన్ల పరిధిలో సుమారు100 మంది అధికారులు, కానిస్టేబుళ్ల ఉన్నారు. వారికి కేటాయించిన సమయం ప్రకారం పగలు, రాత్రి విధులు నిర్వహిస్తుంటారు. వివిధ కేసుల్లో ముద్దాయిలను పిలుచుకురావడం, సాధారణ ఫిర్యాదులో ఉన్న వ్యక్తులను ద్విచక్రవాహనాలపై వెళ్లి తీసుకు రావటం, వివిధ కేసుల రీత్యా తిరగడం, అందుకయ్యే ఖర్చు ముందుగా వారే పెట్టుకోవాలి. నెల మొత్తం అయ్యాక బిల్లు పెడతారు. ఏడాది దాటినా సరెండర్ లీవ్స్, టీఏడీఏలు ఇవ్వకపోవడంతో కుటుంబ అవసరాలకు ముడిపడి ఉన్న ఆర్థిక ఇబ్బందులతో కానిస్టేబుళ్ల ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణనాతీతం. ప్రతి నెలా ఇంటిఅద్దెలు, కుటుంబ ఖర్చులు, పిల్లల ఫీజులు, మెడికల్ ఫీజులు చెల్లింపులకు నెలవారి జీతాలు అంతంత మాత్రంగా సరిపోతాయి. బిల్లులు వస్తాయనే నమ్మకంతో రోజు టిఏ, డిఏ ఖర్చులకు సొంత నగదు చెల్లించి అవి జమకాక కానిస్టేబుళ్ల అవస్థలకు గురవుతున్నారు. పోలీసులకు సరెండర్ లీవ్స్ కింద ప్రతి ఏటా 45 రోజుల వేతనం అదనంగా ఇస్తారు. ఈ సొమ్ము ఏడాదిలో మూడు విడతలుగా జనవరి, జూలై, నవంబర్‌లో నగదును ఖాతాకు జమ చేయిస్తారు. కానీ ఏడాది దాటినా ఇప్పటికీ సరెండర్ లీవ్ నగదు జమ కాలేదు. పోలీస్ సిబ్బందికి టిఏ ఖర్చుల కింద నెలకు రూ.2,500ల వరకు ప్రభుత్వం అంది స్తోంది. అదే ఎస్ఐ స్థాయిఅధికారులకు నెలకు రూ. 4,500 వరకూ వస్తుంది. తాము అధికారంలోకి వస్తే పోలీస్ సిబ్బం దికి వారాంతపు సెలవు ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏడాది గడిచినప్పటికీ వారాంతపు సెలవు గురించి ప్రభుత్వం నోరు మెదపడం లేదు. వీక్లీ ఆఫ్ లేకపోవడంతో పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్యూటీలో అనేక ఒత్తిడికిలోనై అనారోగ్య పాలవుతున్నామని వాపోతున్నారు. వీక్లీ ఆఫ్ ఇవ్వకపోవడమే కాకుండా విజయవాడకు టిప్స్ డ్యూటీ పేరుతో డ్యూటీలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిఎం క్యాంప్ కార్యాలయం డ్యూటీలు కేటాయిస్తున్నారు. ప్రతి సర్కిల్ పరిధిలో డ్యూటీలు చేస్తుంటారు. ఈ మ్యాచ్ 5 రోజులు వేయాల్సి ఉంటుంది. టర్న్ డ్యూటీలు చేస్తున్న పోలీస్ సిబ్బందికి అక్కడ ఎటువంటి వసతులూ కల్పించడం లేదు. తినడానికి తిండి, ఉండడానికి చోటు ఇవ్వరు. సొంత ఖర్యులతో 18 రోజులు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. దీంతో రోజుకు రూ.450కు పైగా ఖర్చవుతోంది. ఆరోగ్యం దెబ్బతింటోంది. టర్న్ డ్యూటీలు రద్దు చేయాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నా ప్రభుత్వ పట్టించుకోవడం లేదు. పోలీసులకు సంబంధిం చిన ఏ ఒక్క హామీనీ కూటమి సర్కార్ నెరవేర్చలేదు. కానిస్టేబుల్ కొడుకునని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మౌనం వహించడంపై పోలీసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంస్కరణల ప్రదాత ఎన్టీఆర్

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - విజయపురిసౌత్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహానందరెడ్డి

సంక్షేమంలో వినూత్న సంస్కరణలు తీసుకొచ్చిన దార్శనికుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న నంద మూరి తారకరామారావు అని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. శనివారం మండల పరిధిలోని కొప్పు నూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలకు శ్రీకారం చుట్టి, జాతీయ స్థాయిలో గొప్ప రాజ కీయ నేతగా కీర్తి గడిచిన వ్యక్తి ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బం దుల్లో ఉన్నా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ లన్నీ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని తెలిపారు.

చంద్రబాబు క్రమశిక్షణే ఆదర్శం..!

చంద్రబాబు క్రమశిక్షణే టీడీపీ శ్రేణులకు ఆదర్శమని ఎమ్మెల్యే జూలకంటి పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గం ప్రశాంత వాతావరణంలో అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇవ్వని విధంగా మాచర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఈ ప్రాంతం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. రూ.800 కోట్లతో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించే పథకం త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాచర్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, రాజబోయిన మధు,నేరేటి వీరస్వామి, జల్లెల కొండలు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారితే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల

మహిళల సాధికారతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఓకళ్యాణ మండపం లో జరిగిన పూజిత మహిళా సొసైటీ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, బ్యూటిషియన్ కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణలో ఎంపిక చేసిన మహిళలకు, యువతులకు సంస్థ ద్వారా ఉచితంగా కుట్టుమిషన్లు, బ్యూటిషియన్ కిట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అతివల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు


కుట్టమిషన్లను అందిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సంక్షేమం కోసం పెద్దపీత వేస్తున్నారని వెల్లడించారు. మహిళ ఆర్థిక స్వావలంబనకు పాటుపడుతున్న పూజిత మహిళా సొసైటీ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పూజిత మహిళా సోసైటీ అధ్యక్షరాలు కోటేశ్వరి, పలువురి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకారులకు గుమ్మడి కళాపీఠం ఆదరణ

ప్రజాశక్తి - వినుకొండ


కళాకారులను సన్మానిస్తున్న గుమ్మడి కళాపీఠం సభ్యులు

ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటున్న కళాకారులను గుమ్మడి కళా పీఠం ఆదరిస్తూ కలలను బతికిస్తుందని అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పన. ప్రవీణ్ కుమార్ అన్నారు. రాత్రి బస్టాండ్ సెంటర్లు గుమ్మడి కళా పీఠం ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పలువురి ప్రశంసలు అందుకు న్నాయి. సభకు రవీంద్ర స్కూల్ కరస్పాండెంట్ ఎస్.కే. సుభాని అధ్యక్షత వహిం చారు. గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపకులు గుమ్మడి వెంక టేశ్వర్లు, మాట్లాడుతూ నిదురలో వచ్చేది కల నిదురించే జాతిని మేల్కొల్పేది కళ అనీ, కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజం మీద ముఖ్యంగా ప్రభుత్వంపై ఉందని అన్నారు. కళాకారులకు "కళాకారుల కార్పొరేషన్" ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముందు గా నాదస్వర కచేరి, వివిధ సినిమాలలోని అభ్యుదయ పాటలతో సంగీత విభావరి నిర్వహించి కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన వారిలో సమాచార హక్కు చట్టం జాతీయ ఉపాధ్యక్షులు మట్టా ప్రసా దు, పాడుతాతీయగా ప్యాడ్‌ప్లేయర్ అండ్ సింగర్ విజయ రాజు, లావణ్య, ప్రముఖ న్యాయవాదులు ఎస్కే. సిద్దయ్య, ఆదిత్య, భావన. రామ్మోహన్రావు, నరసరావుపేటకు చెందిన సామాజిక కార్యకర్త బత్తులమురళి, కోటవెంకట సత్య నారాయణ, గుమ్మడి కమిటీ సభ్యులు దేవరపల్లి నాగేశ్వరరావు, రామయ్య, నియోజకవర్గ కళాకారులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం రొంపిచర్ల మండలంలోని వీరపట్నం గ్రామంలో ఎల్వి ప్రసాద్ ఐ కేర్ సహకారంతో సాగునీటి వినియోగదారుల నీటి సంఘాల భవనంలో టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి వైద్య శిబిరాలతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ శిబిరంలో 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 42 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి, వారికి త్వరలో ఉచిత ఆపరేషన్లు చేయనున్నారు. చల్లా సుబ్బారావు ఆర్థిక సహకారంతో 57 మందికి ఉచితంగా కళ్ళజోడు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ బత్తుల మల్లేష్, డాక్టర్ ప్రసాద్ మునీర్, డాక్టర్ హరీష్ బాబు, డాక్టర్ రమ్య పాల్గొని వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వీరవట్నం మాజీ సర్పంచ్ మాలంపాటి ఏడుకొండలు, నీటి సంఘాల అధ్యక్షుడు చిరుమామిళ్ల మల్లికార్జునరావు, టిడిపి నాయకులు ఆంజనేయులు, గొట్టిపాటి రామారావు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండల కేంద్రంలోని ముప్పాళ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో1988-1993బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. పూర్వ విద్యార్థులు చిన్ననాటి పాఠశాలలోని తమ స్నేహాన్ని అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరు ఏయే రంగాల్లో, ఏ స్థాయిలో ఉన్నారో ఎక్కడెక్కడ స్థిరపడ్డారో ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ ముచ్చటించుకున్నారు. అప్పటి గురువులను స్మరించుకుంటూ ఆనందంగా పాఠశాలలో గడి పారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కలగొట్ల బాలిరెడ్డి, అన్నపురెడ్డి కోటిలింగారెడ్డి, అన్నదాసు సురేష్, పోటు వెంకట లక్ష్మీనారాయణ, తాళ్ళలతా, సయ్యద్అన్వర్, పాల్గొన్నారు.

బస్సుకు స్వాగతం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని సొలస గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రారంభించిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో బస్సుకి ఘన స్వాగతం పలికిన కూటమి నాయకులు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు శ్రీ మద్దూరి వీరారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో మహిళలు రైతులు పార్టీ శ్రేణులు పాల్గొన్ని కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేశారు.

పి4 పథకంలో ప్రముఖులంతా భాగస్వామ్యం కావాలి

- ఘనంగా చుక్కపల్లి శంకరరావు శత జయంతి ఉత్సవాలు
- వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి మనోహర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 పథకంలో ప్రముఖులంతా భాగస్వామ్యం కావాల్సిన అవశ్యకత ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కంచర్లపాలెంలో శనివారం నిర్వహించిన ప్రముఖ వ్యాపారవేత్త చుక్కపల్లి శంకరరావు శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీనిక్స్ ఫౌండేషన్ ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య, కంటి మెగా వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. వైద్య శిబిరంలో సదుపాయాలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. వ్యాధి నిర్ధారణైన రోగులకు ఉచితంగా చుక్కల మందు, కళ్లజోళ్ళు అందించారు. చుక్కపల్లి శంకరరావు జ్ఞాపకాలను పదిలంచేస్తూ వారి కుటుంబ సభ్యులు చేతుల మీదుగా పాఠశాల విద్యార్థినులకు సైకిళ్ళు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ తమ జన్మస్థలాన్ని అభివఅద్ధి పథంవైపు నడిపించాలన్న లక్ష్యంతో చుక్కపల్లి కుటుంభ సభ్యులు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. కంచర్లపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ఆర్వో ప్లాంట్ స్థానికులకు తాగునీరు సమస్యనుంచి విముక్తి కలిగించిందని కొనియాడారు. చుక్కపల్లి కుటుంభ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా యువత ప్రేరణ పొందాలన్నారు. చుక్కపల్లి సురేష్ మాట్లాడుతూ తమ తండ్రి శంకరరావు ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళేవిధంగా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తఅతం చేస్తామన్నారు. కార్యక్రమంలో చుక్కపల్లి కుటుంభ సభ్యులు రమేష్, సురేష్, ఆకాష్, అవినాష్, రాకేష్, కంచర్లపాలెం సర్పంచ్ కోపల్లె మణెమ్మ, కృష్ణారావు, వేణుగోపాల్, నాదెండ్ల మిథున్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.





ఉచిత కంటి శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, సైకిళ్లు పంపిణీ చేస్తున్న చుక్కపల్లి కుటుంబ సభ్యులు, మంత్రి



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

మార్కెట్ యార్డులను పరిశీలించిన అధికారులు


ప్రజాశక్తి - దుగ్గిరాల

రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడమని మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో అధికారుల బృందం స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులను, ఉన్న కో-ఆపరేటివ్ సొసైటీని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిడిసిఎంఎస్ ఛైర్మన్ వడ్డాణం హరిబాబు నాయుడు మాట్లాడుతూ వర్షాలకు పంట మునిగి నీరు తగ్గిన తర్వాత రైతులు డిఏపి కొనుగోలు చేస్తున్నారని, దీంతో కొరత ఏర్పడిందని తెలిపారు. రైతులు ఆర్గానిక్ నానో యూరియా, డిఏపి వాడాలని సూచించారు. ఎరువుల కొరత లేకుండా చూస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. పర్యటనలో డిసిఓ రామారావు, బిజినెస్ మేనేజర్ హరి గోపాలం, ఆఫీస్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్ల పరిశీలన

ప్రజాశక్తి - తెనాలిరూరల్

సకాలంలో ఎరువులు అందించి రైతుల పక్షాన అండగా నిలవడమే కూటమి లక్ష్యమని జిడిసిఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు. శనివారం తెనాలి మండలపరిధిలోని నందివెలుగు, కొలకలూరు గ్రామాలలో పర్యటించిన హరిబాబు రైతులతో సమావేశమై మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో ఎరువులు కొరత రానివ్వకుండా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. రైతులకు అందుబాటులో ఉండేవిధంగా స్టాక్ పాయింట్లు ఏర్పాటుకు అనువైన గోడౌన్స్ పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి రామారావు, బిజినెస్ మేనేజరు హరగోపాల్, కార్యాలయ మేనేజరు శ్రీనివాస్, రైతులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - తెనాలి

ప్రభుత్వ ప్రోత్సాహకాలను పేదలు అందిపుచ్చు కోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక బోస్ రోడ్డు లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. నియోజక వర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ మంత్రిని సంప్ర దించగా, ఆయన సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేయించారు. ఫలితంగా మొత్తం 27 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.27,29,948 విలువైన చెక్కులను మంత్రి అందజేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థ కమిషనర్ అలీం బాషా, టిడిపి నాయకులు, కాండ్రు శ్రీనివాసరావు అన్నారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే పచ్చదనం... పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో లక్ష మొక్కలు నాటాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్, టిడిపి నాయకులు కాండ్రు శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతి గ్రూప్ సంస్థ నుండి 500 మొక్కలను నాలుగు రకాల మొక్కలను అందజేస్తున్నట్లుగా తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి రామారావు, స్వాతి గ్రూప్ సంస్థ ప్రతినిధులు కాండ్రు కోమల కుమార్, బాపనపల్లి శివరాం, ఎం.సురేష్, ఎ.పార్ధసారథి, కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటిన కమిషనర్, టిడిపి నాయకులు

రౌడీషీటర్ నవీన్ అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి



పోలీసుల అదుపులో రౌడీషీటర్ నవీన్

రౌడీ షీటర్ నవీన్‌ను పిడి యాక్ట్ కింద టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాముల నాయక్ వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక ఐతానగర్‌కు చెందిన వేము నవీన్ అలియాస్ కిల్లర్ పై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో పలు కేసులు ఉన్నాయి. అతనిపై రౌడీషీట్ కూడా ఉంది. తరచుగా నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అతనిపై పీడీ యాక్ట్ ప్రయోగించి శనివారం అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఏప్రిల్ 24న పట్టణ వన్ టౌన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చిరంజీవిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆ కేసులో వేము నవీన్ అలియాస్ కిల్లర్ ఎ1 ముద్దాయి.

మా-ఎపి ఎన్నికలకు 86 నామినేషన్లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మాఎపి) సంస్థాగత ఎన్నికల్లో వివిధ పదవులకు పోటీ చేసేందుకు 86 అభ్యర్ధుల నుండి నామినేషన్లు అందినట్లు సంస్థ వ్యవస్థాపకులు దిలీప్ రాజా తెలిపారు. స్థానిక మాఎపి కార్యాలయంలో శనివారం నిర్వ హించిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ జూలై 31తో గడువు పూర్తయ్యిందని, ఏపీతో పాటు, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి నామినేషన్లు వచ్చాయని చెప్పారు. సభ్యత్వంలేని కారణంగా 18 నామినేషన్లను పోటీకి అనర్హులుగా ప్రకటించామన్నారు.

బడుగుల ఆరాధ్య దైవం గౌతు లచ్చన్న : పారేపల్లి మహేష్

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, బడుగుల ఆరాధ్య దైవం సర్దార్ గౌతు లచ్చన్న అని బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ కొనియాడారు. సర్దార్ లచ్చన్న 116వ జయంతి స్థానిక బీసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారేపల్లి మాట్లాడుతూ లచ్చన్న శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతంలోని, బలహీన వర్గాలకు చెందిన గీత కార్మిక గౌడ కులానికి చెందిన వారన్నారు. తన 17 ఏండ్ల వయస్సులోనే స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న యువకిశోరం అన్నారు. 5 సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, ఎమ్మెల్సీగా సమర్ధవంతంగా పనిచేసిన బడుగు వర్గాల నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

పెదకాకానిలో..

ప్రజాశక్తి - పెదకాకాని

గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న ప్రముఖులలో గౌతు లచ్చన్న స్థానం చిరస్మరణీయం అని, అందుకే ప్రభుత్వం సర్దార్ బిరుదుతో సత్కరించింది అన్నారు. గౌడ సంఘం రాష్ట్ర నాయకులు వాకా రాంగోపాల్, రాష్ట్ర బీసీ సంఘం జనరల్ సెక్రెటరీ కుక్కల రాంప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం నాయకులు అనుమోలు ఏడుకొండల గౌడ్ బిజెపి గీత కార్మిక సంఘం మాజీరాష్ట్ర అధ్యక్షులు కుక్కల మల్లికార్జునరావు, పాగోలు శ్రీనివాసరావు, క్రోసరి పూర్ణచంద్రరావు, కారంకి కోటేశ్వరరావు, డాక్టర్ ఉప్పాల శివాజీ, యడవల్లి మధుబాబు, పాగోలు రాము, తుళ్లూరు నరసింహారావు, చింతా పోతురాజు, తాత సాంబశివరావు, వీరంకి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

256వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 256వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కె.స్టీవెన్, ఆదినారాయణ ప్రారంభించారు. దీక్షలలో బి.సూర్యప్రకాశరావు, దామవరపు నాగేశ్వరావు, నారదాసు సుబ్బారావు, ఏనుగుల సాంబశివరావు, సి.హెచ్.పిచ్చయ్య కూర్చున్నారు, కార్యక్రమంలో వై.రమాదేవి, ఈశారమ్మా, టి.దుర్గాభవాని, డి.నాగమల్లీశ్వరి, షేక్ ఇమాంబి, ఇస్మాయిల్, బాషా, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి బస్టాండ్ ఆర్టీసీ బస్సు ఎక్కిన మహిళలు

మంగళగిరిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం శనివారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఏర్పాటుచేసిన ఉచిత బస్సు ప్రయాణం మంగళగిరి బస్టాండ్‌లో ఉదయం 6 గంటలకి మంగళగిరి బస్టాండ్‌కి మహిళలు వచ్చి ఆర్టీసీ బస్సు ఎక్కారు. కండక్టర్ ఉచిత బస్సు ప్రయాణమునకు ఆధార్ కార్డు గాని, ఓటర్ కార్డ్ గాని, ఏదైనా ఐడెంటి తీసుకువస్తే చాలని తెలిపారు. మంగళగిరి డిపో పరిధిలో 33 సర్వీస్‌లు ఉండగా వాటిల్లో 26 సర్వేలు ఉచిత మహిళ బస్సు ప్రయాణానికి అనువుగా ఉన్నాయని తెలిపారు. మంగళగిరి నుండి శ్రీశైలం, ఇతర ప్రాంతాలకు వెళ్లే ఏడు బస్సులకు ఈ సౌకర్యం లేదని డిఎం ఆర్.పిచ్చయ్య తెలిపారు.



వర్షాలకు దెబ్బతిన్న రహదారి

రహదారికి మరమ్మతులు చేయరూ..

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని మంచికలపూడి, కంఠంరాజు కొండూరు గ్రామాల మధ్య ఉన్న తాత్కాలిక రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నీటి ప్రవాహానికి ఆరోడ్డు కొట్టుపోయిందని దీంతో ఇబ్బందులకు పడుతున్నామని తెలిపారు. నిర్మాణంలో ఉన్న వంతెనకు ప్రత్యామ్నాయంగా ఈ రహదారిని ఏర్పాటు చేశారు. వంతెన నిర్మాణ పని పూర్తి కాలేదు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి నీరు వెళ్లే మార్గంలో తూములు ఏర్పాటు చేసి రహదారిని పునరుద్ధరించాలని కోరుకుంటున్నారు.

సాయి ఆదిత్య స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక రింగురోడ్డులోని సాయి ఆదిత్య స్కూల్లో కృష్ణా ష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేష ధారణలతో అలంకరిం చుకొని అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు మోదేపల్లి రవీంద్ర బాబు, సూరె రామ్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ సుజాత, వైస్‌ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, ఇన్‌ఛార్జులు సుబ్బరాయుడు, కృష్ణారావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సుమేధ హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలలో స్కూల్ విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. కృష్ణుడి గీతాలు, నృత్యాలతో అలరించారు. ఉట్టికొట్టే వేడుకలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి కృష్ణాష్టమి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కె.రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకలలో పాల్గొన్న విద్యార్థులు



కెఎల్‌పి పాఠశాలలో కృష్ణాష్టమి

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ కృష్ణ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతూ కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కృష్ణుడు బోధిం చిన గీతను అవగతం చేసుకుంటే ఎలాంటి ఒడిదుడుకులు అయినా అదిగమించవచ్చన్నారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ జి.రత్తయ్య ప్రసంగించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలతో విద్యార్థులు అలరించారు.

ప్రజా బలం లేక ఉద్యమాలపై ఉక్కుపాదం

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ప్రజాబలం లేని బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను ప్రయోగిస్తోందని హైకోర్టు రిటైర్డు జడ్జి బి.చంద్ర కుమార్ విమర్శించారు. శనివారం బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ సభ జరిగింది. ఈ సభకు పౌర హక్కుల సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ బి.చంద్రకుమార్ శాంతి చర్చలు – ఆదివాసీల జీవించే హక్కు అంశం పై మాట్లాడారు. ఎన్నికల హామీలు విస్మరించి కార్పొరేట్లకు అత్యధిక లాభాలు చేకూర్చేందుకు మధ్య భారతంలో అడవులను నరికివేసి వెల కట్టలేని ఖనిజ సంపదను తవ్వి తీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల పర్యావరణం దెబ్బ తిని వాతావరణ మార్పుల వల్ల కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని వివరించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంఅటవీ సంరక్షణ చట్టాలను తుంగలో తొక్కుతున్నారన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగంలో పొందుపరిచిన రక్షణ చట్టాలను బలహీనపరిచి వారిని నిర్వాసితులను చేస్తున్నారని చెప్పారు. 2024లో ఓట్ల దొంగతనం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎలా ఏర్పడిందో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కళ్లకు కట్టినట్లు సాక్ష్యాలు చూపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా అధికారంలో ఉండదని తెలిపారు. రైతు స్వరాజ్య వేదిక నాయకులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత నియంత ప్రభుత్వాలపై ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో ప్రజా కళామండలి వారు ఆలపించిన సాంస్కృతిక గీతాలు సవికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విరసం ప్రధాన కార్యదర్శి రివేరా, కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.కృష్ణ, దండకారణ్య ఉద్యోగ సమితి నాయకులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి ముంపు – ప్రణాళికల లోపం

వీక్షణం

రాజధాని ప్రాంతాన్ని ప్రతి ఏటా పలు వాగులు ముంపునకు గురి చేస్తున్నాయి. రాజధాని అమరావతికి ముంపు సమస్యను శాశ్వత పరిష్కారం కనుగొనేలా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. రోగం ఒకటి అయితే మందు మరొకటి వేసినట్టుగా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టు సంస్థలు వ్యవహరిస్తున్నాయని గత పదేళ్లలో రాజధానిలో ముంపు నివారణ పనులను పరిశీలిస్తే స్పష్టం అవుతోంది. రూ.వందల కోట్లు ఖర్చు చేసినా ఫలితం మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదు. రాజధాని గ్రామాల్లో ముంపు సమస్యను ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం కూడా అధ్యయనం చేసి పలు సూచనలు చేసింది. అయినా ఇంతవరకు అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. రాజధాని ప్రాంతం ముంపులో తీవ్ర ఇబ్బందిగా మారిన కొండ వీటి వాగు కీలక భూమిక పోషిస్తోంది. ఈ వాగు ముంపు సమస్య దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతోంది. 1989లో అప్పటి సిఎం చెన్నారెడ్డి తొలిసారిగా ముంపు నివారణ పథకానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు తొమ్మిది మంది ముఖ్యమంత్రులు మారినా ముంపు సమస్యకి శాశ్వత పరిష్కారానికి నోచుకోలేదు. 2014లో అమరావతి రాజధానిగా ఎంపిక అయిన తరువాత ఈ సమస్యపై సిఎం చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. ముంపు నివారణకు ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి నివేదిక తయారు చేయించారు. గుంటూరు జిల్లా మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో కొండలపై కురిసే భారీ వర్షాలకు సంబంధి ంచిన నీరు పేరేచర్ల, బండారుపల్లి, దామరపల్లి, లాం మీదుగా కంతేరు, పెదపరిమి, నీరుకొండ, నిడమర్రు, కృష్ణాయపాలెం, మందడం, మల్కా పురం, వెలగపూడి మీదుగా ఉండవల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. దీనివల్ల రాజధాని గ్రామాలకు ఈ వాగు వల్ల ముంపు సమస్య ఏర్పడటంతో ఉండవల్లి వద్ద సిఎం చంద్రబాబు నాయుడు ఇంటి వద్ద రూ.224.44 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఈ వాగుల ద్వారా వచ్చే నీటిని 16 పంపులకు 16 మోటార్లు అమర్చి రోజుకు ఐదువేల క్యూసెక్కుల నీటిని కృష్ణానదిలో ఎత్తిపోసేలా పథకాన్ని 2018 సెప్టెంబరు 18న సిఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఇప్పటికీ పేరేచర్ల నుంచి ఉండవల్లి వరకు ముంపు సమస్య వెంటాడుతోంది. నీరుకొండ వద్ద ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి వెళ్లడానికి దారిలేకుండా పోతోంది. గతంలో చేసిన ప్రణాళికలు విఫలం కావడంతో మళ్లీ కొత్త అంచ నాలతో రాజధానిలోనే ముంపు నివారణకు సిఆర్‌డిఎ అధికారులు కొత్త అంచనాలతో మళ్లీ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిసింది. పేరేచర్ల, దామరపల్లి, లాం వద్దకు భారీగా వస్తున్న నీటిని లాం వద్దనే చెక్ డాం, లేదా రిజర్వాయర్ కట్టి ఈ నీటిని గుంటూరు రూరల్ మండలంలోని గ్రామాలకు లేదా తాడికొండ మండలంలోని గ్రామాలకు తాగు, సాగు నీటి కింద వినియోగిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగ పడేది. అలా కాకుండా మొత్తం 35 కిలోమీటర్లు దూరం వాగు నీరు ఉధృతంగా ప్రవహింప చేసి దాదాపు ఐదు మండలాల్లోని 13,500 ఎకరాలలో పంటలను ముంపునకు గురి చేస్తూ చివరికి ఉండవల్లి వద్ద ఎత్తిపోస్తే ప్రయోజనం ఏమిటని పలువురు రైతులు వాపోతున్నారు. మరోవైపు తాడికొండ, గుంటూరు రూరల్ మండలాల్లో ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉంది. ఈ నీటిని లాం వద్ద రూ.225 కోట్లతో ఫిల్టరేషన్ పాయింట్, రిజర్వాయర్ నిర్మించి ఉంటే రాజధానికి ముంపు సమస్య తప్పేది. పొలాలు మునిగి ఏటా రైతులు నష్టపోకుండా ఉంటారు. గుంటూరు రూరల్ మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేది. ఇంజనీరింగ్ నిపుణులు రూ.225 కోట్లు ఖర్చు చేసినా ఇప్పటికీ ముంపు సమస్య ఏటా ఉత్పన్నం అవుతూనే ఉంది. గుంటూరు నుంచి వెలగపూడి సచివాలయానికి వెళ్లేందుకు ప్రతిసారి కోటేళ్ల వాగు వాహనదారులను ఇబ్బంది పెడుతోంది. తాడికొండ మండలం మోతడక, నిడుముక్కల కొండలపై కురిసే వర్షం నీరు పెదపరిమి వద్దకు చేరుతోంది. దీనికి కోటేళ్ల వాగు అని పేరు ఉంది. ఈ రెండు గ్రామాల వద్ద చెక్ డ్యామ్ నిర్మించి అక్కడే చెరువు, రిజర్వాయర్ నిర్మిస్తే ఈ గ్రామాలకు కూడా నీటి ఎద్దడి సమస్య, రాజధాని గ్రామాలకు ముంపు సమస్య రాకుండా ఉంటుంది. ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతి నిధులు, ప్రభుత్వ పెద్దలు ప్రజాధనం వృథా చేయకుండా వాగుల ద్వారా వచ్చే నీటిని పొలాలు, గ్రామాల్లో ముంపు సమస్య లేకుండా సద్వినియోగం చేసుకుంటే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

(ఎ.వి.డి.శర్మ)

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో నాలుగు రోజులపాటు కురిసిన అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. నష్టపోయిన పొలాలను ప్రభుత్వం వెంటనే అంచనా వేయాలని కోరారు. జిల్లాలో సుమారు 80వేల ఎకరాలు పూర్తిగా దెబ్బతిని, పొలాలను చెరువుల్ని తలపిస్తున్నాయని అన్నారు. వాగులు, కాల్వలు, డ్రైనేజి నీరు పొంగిపొర్లటం వల్ల ఈ నష్టం జరిగిందన్నారు. వాగులు, కాల్వల్లో పూడికతీత, తూటికాడ, గుర్రపుడెక్క తొలగించాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోకపోవటం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కొండవీటివాగు, లాం వద్ద ఉన్న ఉన్న కొట్టేళ్ళు వాగు, పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు వద్ద ఉన్న నల్లడ్రైనేజీ కాలువ, గుంటూరులో జొన్నలగడ్డ వద్ద ఉన్న యర్రవాగు పొంగిపొర్లి పైర్లు మొత్తం మునిగిపోయాయన్నారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. వరి పంట ఇప్పటికే రెండుసార్లు వెదపద్ధతిలో వేసి నష్టపోయారన్నారు. ఎకరాకు రూ.15వేలు నష్టపోయారన్నారు. కౌలు రైతులు ఎకరాకు ముందుగానే సుమారు రూ.20వేల నుంచి రూ.40వేల వరకూ చెల్లించారన్నారు. పత్తి, మినుము ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరికి రూ.15వేలు, పత్తికి రూ.20వేలు, ఇతర పంటలకు రూ.10వేలు పరిహారం ఇవ్వాలని కోరారు.

రేపు మండల కేంద్రాల్లో నిరసనలు

ప్రజాశక్తి - గుంటూరు

జిల్లా వ్యాపితంగా రైతు, కౌలు రైతు, వ్యవసాయకార్మికులు ఎదుర్కొనసమస్యల పరిష్కారానికి ఆగష్టు 18వ తేదీన మండల కేంద్రాల్లో నిరసనలు, 19,20 తేదీల్లో సచివాలయాల వద్ద ఆందోళనలు జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బి రామకృష్ణ, పి నాగమల్లేశ్వరరావు, సహాయ కార్యదర్శి పాశం రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింప చేయాలని, భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని అధిక వర్షాలు, వరదలకు నష్టపోయిన వరి, తదితర పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని, ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 రోజులు పనిదినాలు కల్పించి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని తెలిపారు. నల్లబర్లీ పొగాకు కేంద్రాలను పెంచి మొత్తం పొగాకు కొనుగోలు చేయాలని కోరుతూ జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని వారు కోరారు.

ఎర్రవాగు పొంగి దెబ్బతిన్న పైర్లు

ప్రజాశక్తి-గుంటూరు

గత వారం అధిక వర్షాలకు గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డలో ఎర్రవాగు పొంగి పంటలు దెబ్బతిన్నాయని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఇమ్మడి రామారావు అన్నారు. శనివారం గ్రామ పరిధిలో నీట మునిగిన పంటలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. 250 ఎకరాలలో వరి, 15 ఎకరాల్లో పత్తి పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. ఎర్రవాగుకు ప్రతిసారి వరదలు వచ్చినప్పుడు గ్రామంలోని పంట పొలాల దెబ్బతింటున్నాయని, శాశ్వత పరిష్కారానికి పలుమార్లు క్షేత్రస్థాయి నుండి జిల్లాస్థాయి అధికారుల వరకు విన్నవించుకోవడం జరిగిందన్నారు. కానీ ఇంతవరకు శాశ్వత పరిష్కారం చేయలేదన్నారు. దీనివల్ల గత నాలుగు రోజుల నుంచి కురిసిన అధిక వర్షాలవల్ల రైతుల, కౌలు లు రైతులు పెట్టిన పెట్టుబడి పూర్తిగా నీటిలో కలిసిపోయిందన్నారు. కొండవీటి వాగునీరు, గుంటూరు సిటీ కొంత నీరు ఎర్రవాగులోకి చేరటంతో ఎర్రవాగు పొంగి పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వరి, పత్తి, ఇతర నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ఎర్ర వాగును పూడిక తీసి శుభ్రం చేయాలని కోరారు. పొలాలను పరిశీలించిన వారిలో జొన్నల కోటిరెడ్డి, ఇమ్మడి నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షులు ఇమడాబత్తుని వీరశేఖర్, వెల్లలూరు అప్పారావు తదితరులు ఉన్నారు.



జొన్నలగడ్డలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు